ఊపందుకున్న సాగు



- 1.10లక్షల ఎకరాల్లో వరి నాట్లు పూర్తి
- పక్షం రోజుల్లో పూర్తికానున్న 1.60 లక్షల ఎకరాల సాగు
- ప్రాజెక్టుల్లో పెరుగుతున్న జలాలు
- ఎస్సారెస్పీలో 34 టీఎంసీలకు చేరిక
- ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరు,ఎల్‌ఎండికి నీటి తరలింపు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

వర్షాభావ పరిస్థితులతో ఆందోళన చెందిన జిల్లా రైతన్నలు ఇప్పుడిప్పుడే వానాకాలం సాగుపై ఆశలు పెంచుకున్నారు. ప్రాజెక్టులు ఇంకా పూర్తిగా జలకళ సంతరించుకోక పోయినా క్రమేపీ చేరుతున్న వరదతో సాగుకు ఢోకా లేదని భావిస్తున్నారు. గడిచిన తొమ్మిది రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరగా నాట్లు వేయడం ముమ్మరం చేశారు. ఈ వానాకాలం జిల్లాలో 2.75 లక్షల ఎకరాలలో వరి సాగు జరుగుతుందని అంచనా వేసిన జిల్లా వ్యవసాయశాఖ అందుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులను అందుబాటులో ఉంచేలా కార్యాచరణ సిద్ధం చేసి అమలు చేస్తున్నది. జూన్ రెండవ వారం నుంచి వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించినా జూన్ 15 నుంచి జూలై 15 వరకు పూర్తిగా వానలు లేకుండా పోవడంతో వర్షాభావ పరిస్థితులు తప్పవా అని ఆందోళన చెందారు. వరుసగా జూలై 17 నుంచి ఏర్పడిన రెండు అల్పపీడనాల కారణంగా వరి నాట్లు వేసుకునేందుకు అవసరమైన నీరు అందేలా వర్షాలు కురిశాయి. జూన్ ప్రారంభం నుంచి జూలై 26 వరకు సాధారణ వర్షాపాతం 350.6 మి.మీ. కాగా 527 మి.మీ వర్షపాతం నమోదైంది. గత సంవత్సరంతో పోలిస్తే ఇది 100 మి.మీ. తక్కువే అయినా వరి నాట్లకు ఉపయోగపడటంతో 1.10 లక్షల ఎకరాలలో రైతన్నలు నాట్లు పూర్తి చేశారు. మరో 15 రోజుల్లో 1.60 లక్షల ఎకరాలలో వరినాట్లు పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఎస్సారెస్పీ ఆయకట్టు 1.45 లక్షల ఎకరాలు కాగా మరో 1.45 లక్షల ఎకరాల్లో బావులు, చెరువుల ఆధారంగా వరి సాగు చేస్తారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు జిల్లాకు ప్రధాన జలవనరుగా ఉంది. ఈ ప్రాజెక్టు కింద నిజామాబాద్ నుంచి మొదలుకొని సూర్యాపేట జిల్లా వరకు 13.63 లక్షల ఎకరాలు సాగు అవుతాయి. 80.5 టీఎంసీల నీరు నిలువ ఉండాల్సిన ఈ ప్రాజెక్టు ఇటీవల వరకు నీరు లేకుండా పోయినా ప్రస్తుతం ఎగువ నుంచి వస్తున్న వరదతోపాటు స్థానికంగా కురుస్తున్న వర్షాల కారణంగా 33.85 టీఎంసీలకు చేరింది. వానాకాలం సాగు కోసం 60 నుంచి 70 టీఎంసీల నీరు అవసరం కాగా ఇప్పటికే 34 టీఎంసీల నీరు వచ్చి చేరడం రాబోయే రోజుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతుండడంతో రైతులు సాగుపై ఆశలు పెంచుకున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న మరో ప్రధాన జలవనరులైన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో జలకళ సంతరించుకున్నది. ఈ ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, ఇప్పటికే 17.813 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి అలాగే కడెం ప్రాజెక్టు నుంచి 16,081 క్యూసెక్కుల వరద నీరు వచ్చి ప్రాజెక్టులో చేరుతున్నది. ఈ నీటి ప్రవాహంతో రెండురోజుల్లోనే ప్రాజెక్టు పూర్తి నీటి మట్టానికి చేరుకొని గేట్లు తీసి నీటిని దిగువకు వదలాల్సిన పరిస్థితి వస్తుంది. దీనితో అధికారులు నీటిని వృధా పోనివ్వకుండా చూసేందుకు మూడు రోజుల నుంచి నంది పంపుహౌజ్ నుంచి ఐదు పంపుల ద్వారా 15,750 క్యూసెక్కుల నీటిని మధ్యమానేరుకు తరలిస్తున్నారు. మధ్యమానేరు నిండితే దాని నుంచి దిగువ మానేరుకు నీరు వదిలే అవకాశముంటుంది. అలాగే ఎగువన ఉన్న మెదక్ జిల్లా ప్రాజెక్టులకు కూడా నీటిని తరలించే అవకాశమున్నది.

మధ్యమానేరు నీటి నిలువ సామర్థ్యం 27.54 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.83 టీఎంసీల నీరు ఉన్నది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 15,750 క్యూసెక్కుల నీటిని ఈ ప్రాజెక్టుకు తరలిస్తున్నారు. ఎల్లంపల్లికి వరద పెరిగితే మధ్య మానేరుకు మరింత ఎక్కువ నీటిని తరలించే అవకాశమున్నది. ప్రస్తుతం వదులుతున్న 15,750 క్యూసెక్కులతో రోజుకు సుమారు 1.40 టీఎంసీల నీరు వచ్చి చేరుతున్నది. ఈ ప్రవాహమే కొనసాగినా 10 నుంచి 12 రోజుల్లో ప్రాజెక్టు నిండే అవకాశమున్నది. జిల్లాలో ప్రధాన నీటి వనరుగా ఉన్న ఎల్‌ఎండీలో మాత్రం ఇప్పటికీ ఆశాజనకమైన నీరు వచ్చి చేరలేదు. 24.034 టీఎంసీల సామర్థ్యంగల ఈ ప్రాజెక్టులో 5.364 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. అలాగే 206 క్యూసెక్కుల నామమాత్రపు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఈ ప్రాజెక్టుకు కూడా ఎల్లంపల్లి ద్వారా నీటిని తరలించే అవకాశం ఉండగా ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ ద్వారా నీటిని విడుదల చేసే అవకాశాలున్నాయి. వర్షాకాలం ఆరంభంలోనే ఉండడంతో ప్రాజెక్టులకు తప్పకుండా నీరు వచ్చి చేరుతుందని ఆశించి రైతులు వరిసాగు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే మొక్కజొన్న, పత్తి పంటలను పూర్తిస్థాయిలో సాగు చేశారు. ఎల్‌ఎండీ ఎగువన జిల్లాకు చెందిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు 22వేల ఎకరాలు ఉండగా ఎల్‌ఎండీ దిగువన హుజురాబాద్ వరకు 1.23 లక్షల ఎకరాలు ఉన్నాయి. ఈ 1.45 లక్షల ఎకరాల సాగుకు 14 టీఎంసీల నీరైతే సరిపోతుంది.

బేటీ బచావో కాదు... కూటమి బచావో బడ్జెట్

- ఐద్వా జాతీయ నాయకురాలు టి జ్యోతి

భగత్‌నగర్, జూలై 29: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ బేటీ బచావో బడ్జెట్ కాదని, ఎన్‌డిఏ కూటమి బచావో బడ్జెట్ అని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ నాయకురాలు టి జ్యోతి అన్నారు. సోమవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో నాలుగు రోజులుగా జరుగుతున్న ఐద్వా రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024-25 సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మహిళల్ని పూర్తిగా విస్మ రించారన్నారు. బేటి బచావో అని చెబుతున్న కేంద్రం కుర్చీ బచావో అనే విధంగా బడ్జెట్ కేటాయించారన్నారు. మహిళల అభ్యున్నతికి ఉద్యోగ కల్పన, కుటీర పరిశ్రమలకు నిధులు కేటాయించడక పోవడం మహిళల్ని అవమా నించడమే అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై వేధింపులు అధికంగా ఉన్నాయన్నారు. మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించినా ప్రధాని నరేంద్ర మోదీ నోరు మెదప లేదన్నారు. దేశానికి బంగారు పతకాలు అందించిన రెజ్లర్ల పై ఎంపీ లైంగికంగా వేదిస్తే చర్యలు ఎందుకు తీసుకోలేద న్నారు.హత్రాస్, కథువా, ఉన్నావ్ లాంటి ఘటనల్లో బీజేపీ నాయకులే దుండగులకు కొమ్ముకాసే విధంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు లక్ష్మీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. మహిళలకు రూ. 2500, మహిళా గ్రూపలలో 20 లక్షల వడ్డీ లేని రుణాలు, కొత్తగా అర్హత ఉన్న వారికి రేషన్‌కార్డులు, పెన్షన్‌లు మంజూరు చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లను అర్హులైన వారికి కేటాయించాలన్నారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగు రోజులుగా జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగుల్లో మహిళలని చైతన్య పరిచి రానున్న రోజుల్లో మహిళా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ అరుణజ్యోతి, ఉపాధ్యక్షురాలు కెఎస్ ఆశాలత, మాగర్ల భారతి, సహాయ కార్యదర్శి పాలడుగు ప్రభావతి, ఎస్ రత్నమాల, కె గీతారాణి, మద్దెల వినోద, నాగలక్ష్మి, బి అనురాధ, శశికళ, అహల్య, కరీంనగర్ జిల్లాకార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షురాలు ద్యావ అన్నపూర్ణ, రోజారాణి, దేవేంద్ర, రజిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టి జ్యోతి

బల్దియాలో రూ.50 కోట్లకుపైగా
పెండింగ్ బిల్లులు

- ఆగస్టు 2న హరితహారం, 3న జనరల్ ఫండ్ టెండర్లు
- టెండర్ల బహిష్కరణకు కాంట్రాక్టర్ల నిర్ణయం
- ఆగస్టు 15లోగా బిల్లులు ఇవ్వకుంటే ఆందోళనకు కార్యాచరణ



కరీంనగర్ టౌన్, జూలై 29: గత సంవత్సరం జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో నగరంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలే దర్శనమిచ్చాయి. 60 డివిజన్లలో స్మార్ట్‌సిటీ, సీఎం హామీ, మున్సిపల్ జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులతో నగరంలో పనుల జాతర కొనసాగింది. మున్సిపల్ కాంట్రాక్టర్లు ఎంతో ఉత్సాహంగా పనులు చేసేందుకు పోటీపడి టెండర్లను దక్కించుకొని పనులు చేశారు. వాటిలో కొన్ని పనులు పూర్తికాగా, మరికొన్ని పనులు జరుగుతుండగానే అసెంబ్లీ ఎన్నికలు, ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలు జరుగడంతో అభివృద్ధి పనులు స్తంభించి పోయాయి. అలాగే ఆయా పనులకు సంబంధించిన బిల్లులు కూడా ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దాదాపు 10 నెలల నుంచి పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, కమిషనర్లు, మేయర్, పాలకవర్గ సభ్యుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నగరపాలక సంస్థలో 135 మంది రిజిస్టర్డు కాంట్రాక్టర్లు ఉండగా వారిలో దాదాపు 45 నుంచి 50 మంది కాంట్రాక్టర్లు పనులు పూర్తిచేసి బిల్లుల కోసం నిరీక్షిస్తున్నారు. రూ.28 కోట్ల జనరల్ ఫండ్, 14 కోట్ల పట్టణ ప్రగతి, 8 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన బిల్లులు మొత్తం 50 కోట్ల మేరకు పెండింగ్‌లో ఉన్నాయని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. తమకు బిల్లులు ఇప్పించాలంటూ ప్రతిరోజూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న కాంట్రాక్టర్లు చివరకు విసిగివేజారి అప్పోసప్పో చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇచ్చే వరకు కొత్తగా పనులు చేయవద్దని, ఆగస్టు 15 వరకు వేచి చూసి ఆ తర్వాత ఆందోళన చేపట్టాలని నిర్ణయించుకున్నారు. సోమవారం మున్సిపల్ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం సమావేశమై ఆగస్టు 2, 3వ తేదీల్లో నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న వనమహోత్సవం, జనరల్ ఫండ్‌కు సంబంధించిన టెండర్లను బహిష్కరించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ కమిషనర్, పాలకవర్గం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.

బిల్లులను ఇవ్వక పోవడంతో టెండర్లను బహిష్కరిస్తాం

-దుగ్గు మహేందర్

గడిచిన పది నెలల నుంచి అభివృద్ధి పనులు పూర్తిచేసిన పెండింగ్ బిల్లులను ఇవ్వాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అప్పోసప్పో చేసి పనులు పూర్తి చేస్తే బిల్లులు సకాలంలో ఇవ్వక పోవడంతో వడ్డీలు కట్టుకోలేక కాంట్రాక్టర్ల మంతా ఇబ్బంది పడుతున్నాము. బిల్లుల కోసం సమావేశమై ఆగస్టు 2,3 తేదీల్లో నిర్వహించే వనమహోత్సవం (హరితహారం), జనరల్ ఫండ్ పనులకు సబంధించిన టెండర్లను బహిష్కరించాలని నిర్ణయించుకున్నాం.ఆగస్టు 15లోగా బిల్లులు ఇవ్వకుంటే ఆ తర్వాత తీసుకోవలసిన తదుపరి కార్యాచరణ రూపొందించుకొని అవసరమైతే ఆందోళన చేసేందుకు సిద్ధమవుతాం.




తారు తొలగించిన అనంతరం రోడ్డు


తారు పూర్తిగా తొలగించిన అనంతరం..

కరీంనగర్ తీగెల వంతెన రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారడంతో తారును తొలగించారు. తారు పూర్తిగా తొలగించడంతో కేబుట్ బ్రిడ్జి రోడ్డు సీసీ రోడ్‌గా మారిపోయింది. ఈ రోడ్డుపై తరచూ మరమ్మతులు జరుగుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

▪ ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్

స్మార్ట్‌సిటీతో తీగలవంతెన నిర్మాణానికి సంబంధం లేదు

- మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జూలై 29: నగరంలోని తీగలవంతెన ప్రాజెక్టుకు, స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌కు ఎలాంటి సంబంధం లేదని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు స్పష్టం చేశారు. రోడ్డు భవనాలశాఖ ఆధ్వర్యంలో మానేరు నదిపై తీగలవంతెన నిర్మాణం చేశారని, దానికి స్మార్ట్‌సిటీ కార్పొరేషన్‌కు ఎలాంటి సంబంధం లేదని, రోడ్లు భవనాలశాఖ ఆధ్వర్యంలో నిర్మాణం చేశారన్నారు. అంతేకాకుండా తీగలవంతెన నిర్వహణ బాధ్యతలు కూడా ఆర్‌అండ్‌బి శాఖ అధికారులే చూస్తున్నారని చెప్పారు. నగరంలోని 14.4 కి.మీ. ప్రధాన రహదారులు, పలు చోట్ల డ్రైనేజీలు, కల్వర్టులు కూడా రోడ్డు భవనాలశాఖకు చెందినవేనని అన్నారు. నగరంలోని అంతర్గత రోడ్లు, డ్రైనేజీలకు మాత్రమే నగరపాలక సంస్థకు సంబంధం ఉందని, వాటి విషయంలోనే పూర్తి బాధ్యత తీసుకుంటామని చెప్పారు. నగరంలోని స్మార్ట్‌సిటీ పనులపై ప్రత్యేక దృష్టి ఉందని, ఎక్కడ ప్రజలకు ఇబ్బందు లు కలుగకుండా నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. 60 డివిజన్లలో ఏర్పడే సమస్యలను కార్పొరేటర్ల ద్వారా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని అన్నారు. సీఎం హామీ నిధుల పనులు కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని, వర్షాలతో అసంపూర్తి పనులు జరిగిన చోట కొంత ఇబ్బంది ఏర్పడిందని అన్నారు. పనులు పూర్తయ్యే వరకు ప్రజలు సహక రించాలని కోరారు. వర్షాలు కొంత తగ్గుముఖం పట్టిన వెంటనే అసంపూర్తి పనులు పూర్తిచేస్తామని మేయర్ సునీల్‌రావు స్పష్టం చేశారు.

పవర్‌లూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్ రూరల్, జూలై29: పవర్ లూమ్ కార్మికుల సమస్య లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు యం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పవర్‌లూం యజమానులు కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ మండలంలోని పలుగ్రామాల పవర్ లూం కార్మికులు నిరసన దీ క్షలు చేస్తున్నారు. సోమవారం దీక్షలు 16వ రోజుకు చేరుకున్నా యి. నిరసన దీక్షలకు సంఘీభా వంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్య క్షుడు యం శ్రీనివాస్ హాజరై మా ట్లాడారు. ఐదు గ్రామాల్లో పవర్‌లూమ్ యజమానుల దగ్గర సుమారు 150 మంది కార్మికులు పనిచేస్తున్నారని, కూలీ రేట్లు పెంచాలని విన్నవించుకున్నా యజమానులు పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికీ తక్కువ కూలీ రేట్లకు పని చేస్తున్నారని, ప్రభుత్వం నుంచి, యజమానుల నుంచి కార్మికులకు ఎలాంటి సౌకర్యాలు అందడం లేదని, ఇల్లు లేక కిరాయి కట్టుకుంటూ రోజువారి కూలీతో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. యజమానులు కార్మికులను చర్చలకు పిలిచి కూలీ రేట్ల ఒప్పందం కుదుర్చుకుని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. లేకుంటే కార్మికులు చేసే ఆందోళనకు యజమా నులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు దూడంగంగాధర్, కొండ బత్తుల స్వామి, రాజయ్య, మల్లేశం, రాజు, కమిటీ సభ్యులు, పవర్‌లూమ్ కార్మికులు పాల్గొన్నారు.



నిరసన దీక్షలో పాల్గొన్న పవర్‌లూమ్ కార్మికులు, సీఐటీయూ నాయకులు



వ్యక్తి అదృశ్యం

జమ్మికుంట రూరల్, జూలై29: మోత్కులగూడెంకు చెందిన మనోజ్ కుమార్ నాలుగు రోజుల క్రితం అదృశ్యం అయ్యాడని భార్య లావణ్య పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మనోజ్‌కుమార్ ఈ నెల 26న పనికి వెళ్తున్నానని భార్యకు చెప్పాడు. బయటకు వెళ్లి తిరిగా రాలేదు. మూడు రోజులుగా ఆచూకీ లేక పోవడంతో భార్య ఫిర్యాదు చేసిందని పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

యమ ధర్మరాజు ఆలయంలో అభిషేకం



స్వామి వారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

ధర్మపురి, జూలై 29: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి అనుబంధ యమ ధర్మరాజు ఆలయంలో స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు సోమవారం నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ మంత్రో చ్చరణల మధ్య అర్చకులు నేరెళ్ల సంతోష్ కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్య సూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అప మృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు నేరెళ్ల ప్రదీప్‌కుమార్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

● ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి క్షేత్రంలో సోమవారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. సెలవు దినం కావటం వల్ల లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. క్షేత్ర నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమ ధర్మరాజు ఆలయాన్ని అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో
వ్యవసాయ కూలీ ఆత్మహత్య



సత్తయ్య(ఫైల్)

కోనరావుపేట, జూలై 29: ఆర్థిక ఇబ్బందులతో వ్యవసాయ కూలి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన తాళ్లపెల్లి సత్తయ్య(40) అనే వ్యవసాయ కూలీ కూలి పనులతోపాటు భూమి కౌలుకు తీసుకొని సాగు చేసే వాడు. వ్యవసాయంలో దిగుబడి తగ్గి నష్టం రావడంతో గతంలో రెండు సార్లు పురుగుల మందు తాగి ఆత్మ హత్యకు యత్నించాడు. మరోసారి గొంతు కోసుకున్నాడు. మూడుసార్లు ఆత్మహత్యకు యత్నించగా చికిత్సకైన ఖర్చులతోపాటు వ్యవసాయంలో వచ్చిన నష్టంతో రూ.10 లక్షల వరకు అప్పు పేరుకుపోయింది. దీంతో ఆవేదనకు గురైన సత్తయ్య ఆదివారం సాయంత్రం పొలం వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పురుగుమందు తాగానని చనిపోతున్నానని చెప్పాడు. వెంటనే అక్కడికి చేరుకొని సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజనేయులు తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు

శంకరపట్నం, జూలై 29: మండలంలోని గొల్లపల్లి శివారులో కరీంపేటకు చెందిన వ్యాపారి చేపట్టిన నిర్మాణానికి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని యువజన సమితి రాష్ట్ర కార్యదర్శి మోర గణేశ్ ఆరోపించారు. సోమవారం నిర్మాణం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కరీంపేటకు చెందిన ఓ వ్యాపారి ఇల్లు నిర్మిస్తున్నాడని చెప్పారు. అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న వ్యాపారిపై శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ మట్టి తరలింపు వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.





















భార్యను చంపి భర్త ఆత్మహత్య


లక్ష్మి, రాజేశం(ఫైల్)

సిరిసిల్ల క్రైం, జూలై 29: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో ఆదివారం అర్ధరాత్రి దారు ణం చోటు చేసుకుంది. కుటుంబ కలహాలతో జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన దూస లక్ష్మి (50)ని ఆమె భర్త దూస రాజేశం (55) రాడ్డుతో కొట్టి చంపి అనంతరం ఉరేసు కొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం... శాంతినగర్‌కు చెందిన దూస లక్ష్మి, రాజేశం దంపతులు పవర్‌లూంలు నెలకొల్పి జీవనం సాగిస్తున్నారు.. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, కు మార్తె ఉన్నారు. రెండేళ్ల క్రితం రాజేశంకు రెండు కిడ్నీలు దెబ్బతినడంతో డయాలసిస్ చేయించు కుంటున్నాడు. సర్జరీ చేసి కిడ్నీలు మార్పిడి చేయించాలని రాజేశం కొద్ది రోజులుగా కోరుతున్నాడు. ఈ విషయంలో భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి గొడవ తలెత్తి క్షణికావేశంలో రాజేశం భార్య లక్ష్మిని రాడ్డుతో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం రాజేశం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

ఎన్టీపీసీ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

జ్యోతినగర్, జూలై 29: రామగుండం ఎన్టీపీసీలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఒక ఉద్యోగి సోమ వారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రామగుండం ఎన్టీపీసీలో వర్క్‌మెన్‌గా పని చేస్తున్న సదరు ఉద్యోగిని 2019లో కేరళలోని కాయంకులం ఎన్టీపీసీకి యాజమాన్యం బదిలీ చేసింది. మొదటిసారి బదిలీ అయినప్పుడు కూడా ఆత్మహత్యాయత్నం చేసుకు న్నాడు. అప్పుడు యాజమాన్యం ఉద్యోగిపై ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ నేపథ్యంలో అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా ఉద్యోగిని డిప్యూటేషన్‌పై తిరిగి రామగుండం ఎన్టీపీసీకి పంపించారు. అతని డిప్యూటేషన్ కాలపరిమితి ముగియడంతో తిరిగి డిప్యూటేషన్‌ను కొనసాగించి రామగుండంలోనే పనిచేసేందుకు అనుమతి వ్యాలంటూ చేసిన ప్రయత్నం ఫలించ లేదు. ఈక్రమంలో సోమవారం ఎన్టీపీసీ పరిపాలనా భవ నం(ఏడీఎం బిల్డింగ్) ఆవరణలో నిద్ర మాత్రలు మింగి నట్లు తెలుస్తున్నది. అతడిని ఎన్టీపీసీ ధన్వంతరి ఆసుపత్రికి తర లించి చికిత్స చేయిస్తున్నట్లు సమాచారం. ఎన్టీపీసీ పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి రిమాండ్

మానకొండూర్, జూలై 29: మండలంలోని దేవంపల్లి గ్రామానికి చెందిన గాడిచర్ల తిరుపతిపై హత్యాయత్నం చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన గాడిచర్ల సాయికుమార్, అతడి తండ్రి గాడిచర్ల రాజును సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ సదన్‌కుమార్ తెలిపారు. భూతగాదాలతో ఈ నెల 19నగొడ్డలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు.

ఒకరిపై వరకట్నం కేసు నమోదు

జమ్మికుంట, జూలై 29: అబాది జమ్మికుం టకు చెందిన నికత్నిస తన భర్త జమీర్ పాషా అదనపు వరకట్నం కోసం వేధిస్తున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశా రు. జమీర్ పాషా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నా డని ఫిర్యాదు చేసిందని పట్టణ సీఐ రవి తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరి మృతి

వేములవాడ రూరల్, జూలై 29: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం .. మండలంలోని మర్రి పల్లి గ్రామానికి చెందిన తుపాకుల పర్శరాములు (68) సోమ వారం మోటారు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు జారీ వ్యవసాయబావిలో పడిపోయాడు. తీవ్రగాయాలవడంతో మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసు లు, అగ్నిమాపక సిబ్బందితో కలిసి మృతదేహాన్ని బావిలో నుంచి వెలికి తీశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు

మెట్‌పల్లి రూరల్, జూలై 29: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలోని హాస్టల్స్‌లో మౌలిక వసతులు కరువయ్యాయని, శిథిల భవనాల్లో విద్యార్థులు నలుగుతున్నారని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఎదుట నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలకు చెందిన రాజారపు గణాధిత్య అనుమానాస్పదస్థితిలో మరణించడం, అదే రూమ్‌లోని రావర్తి హర్షవర్ధన్, అడేపు గణేష్ పాము కరవడంతో హైదరాబాద్‌లో చికిత్స పొందం బాధకరమని చెప్పారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు రాపాక సాయికుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మదవేణి సునీల్, నాయకులు మారుతీ, మహాదేవ్, జస్వంత్, అక్షయ్, పవన్, అభి, మణిదీప్, విగ్నేష్, కిరణ్, నితీష్, రాకేష్, మనిష్, నిఖిలేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే వారసంత

- నిరుపయోగంగా మార్కెట్ భవనం- సమీకృత మార్కెట్‌కు మోక్షం కరువు


రాయికల్‌లో రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు


రాయికల్, జూలై 29: రాయికల్ పట్టణంలో వారసంత క్రయ, విక్రయాలు రోడ్డుపైనే జరుగుతున్నాయి. స్థానిక పాత బస్టాండ్ నుంచి ఇటిక్యాల క్రాసింగ్ రోడ్డు వరకు ప్రతి శనివారం ట్రాఫిక్ జామ్‌తో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూరగాయలు, మాంసం విక్రయాల కోసం రూ.42 లక్షల వ్యయంతో మార్కెట్ భవనం నిర్మించినా కూరగాయల వ్యాపారులు, మాంసం విక్రయదారులు ఈ భవనాన్ని వినియోగించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. కూరగాయల వ్యాపారులు, మాంసం విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- మూలుగుతున్న రూ.3 కోట్ల నిధులు

రాయికల్ బల్దియాలోని ప్రజలకు ఒకేచోట అన్ని రకాల కూరగాయలు, మాంసాన్ని విక్రయించేందుకు నాలుగేళ్ల క్రితం టీయూఎఫ్‌డీసీ నిధుల నుంచి రూ.3 కోట్లతో సమీకృత మార్కెట్‌కు నిధులు మంజూరయ్యాయి. పట్టణ శివారులోని మార్కెట్ యార్డులో 20 గుంటల స్థలాన్ని అప్పటి కలెక్టర్ రవినాయక్ స్థలాన్ని ఎంపిక చేసి టెండర్ చేపట్టారు. పట్టణానికి దూరంగా ఉంటుందని, మార్కెట్ యార్డులో సమీకృత మార్కెట్ నిర్మిస్తే రైతులకు స్థలం సరిపోదనే ఉద్దేశ్యంతో ఆందోళన నిర్వహించారు. దీంతో కాంట్రాక్టర్ పనులు చేయలేక పరారయ్యారు.

- స్థలం కోసం అన్వేషణ

రాయికల్ బల్దియాలో సమీకృత మార్కెట్ కోసం మంజూరైన రూ.3 కోట్ల నిధులు మార్కెట్ ఏర్పాటు చేయకపోవడంతో తిరిగి ప్రభుత్వ ఖాతాలోకి చేరనున్నాయి. బల్దియాలో 20 గుంటల స్థలం సైతం లేకపోవడంతో సమీకృత మార్కెట్ ఏర్పాటు కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపల్ పాలక మండలి సభ్యులు, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్పందించి రాయికల్ పట్టణానికి మంజూరైన సమీకృత మార్కెట్‌ను ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా చూడాలి




రూ.42 లక్షలతో మార్కెట్ భవనం..

రాయికల్ పట్టణంలో రూ.42 లక్షలతో మార్కెట్ భవనం నిర్మించాం. కూరగాయలు, మాంసం విక్రయదారులు రోడ్డుపైనే విక్రయిస్తుండటంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. మార్కెట్ భవనంలోనే విక్రయించేలా చూస్తాం.

- మోర హన్మాండ్లు, మున్సిపల్ చైర్మన్

ప్రజలకు అందుబాటులో ఉండేలా కృషి..



రాయికల్ పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.3 కోట్లతో మంజూరైన సమీకృత మార్కెట్ పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండేలా పాలకమండలి సభ్యులతో చర్చిస్తాం. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సహకారంతో ఏర్పాటు చేసేలా కృషి చేస్తాం. - చిరంజీవి, మున్సిపల్ కమిషనర్

శ్రీపాద ఎల్లంపల్లి నుంచి

కొనసాగుతున్న ఎత్తిపోతలు

» ఐదు మోటర్ల ద్వారా 15,750 క్యూసెక్కుల నీరు తరలింపు


గాయత్రి పంప్ హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

పెద్దపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిపై నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండడంతో మిడ్‌మానేరు రిజర్వాయర్‌కు ఎత్తిపోతలను కొనసాగిస్తున్నారు. సోమవారం ఉదయం 18,655 క్యూసెక్కుల వరద నీరు రాగా, సాయంత్రం వరకు 16,081 క్యూసెక్కులకు తగ్గింది. కడెం ప్రాజెక్టు నుంచి 8,170 క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 7,911 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. దీంతో నిన్నటి వరకు నంది మేడారం నంది పంప్‌హౌస్ నుంచి 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసె క్కుల నీటిని తరలించిన ప్రాజెక్టు అధికారులు ఉదయం నుంచి 5 మోటార్ల ద్వారా 15,750 క్యూసెక్కుల నీటిని గాయత్రి పంప్‌కు, అక్కడినుంచి మిడ్ మానేరు తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, సాయంత్రం 6 గంటల వరకు 17.813 టీఎంసీల నీటి మట్టానికి చేరుకున్నది. ప్రాజెక్టు ఎగువ భాగాన వర్షాలు తగ్గుముఖం పట్టాయి. వరద పెరిగితే మాత్రం మరో రెండు మోటార్లను ప్రారంభిస్తామని నీటి పారుదల అధికారులు చెబుతున్నారు.

● గాయత్రి పంప్ హౌస్ నుంచి ..

రామడుగు: మండలంలో లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. శనివారం 4 బహుబలి పంపు నుంచి నీటి విడుదల చేసిన అధికారులు ఆదివారం వరకు కొనసాగించారు. కాగా సోమవారం నుంచి ఐదు పంపుల ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. రెండు రోజుల పాటు రోజుకు 12,600 క్యూసెక్కుల నీటి విడుదల చేసిన అధికారులు సోమవారం ఐదు పంపులదావ్రా 15,750 నీటిని విడుదల చేశారు. డెలివరి పాయింట్ నుంచి గ్రావిటి కెనాల్‌లోని ఐదు పంపులు, ఒకేసారి విడుదల కావడంతో నీటి ప్రవాహం ఉప్పొంగుతూ ప్రవహిస్తోంది. గ్రావిటి కెనాల్ నుంచి నీటి ప్రవాహం పరవళ్లు తొక్కుతూ వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు చేరుతోంది. కాగా ఐదు పంపులతో నీటి విడుదల కొనసాగిస్తుండగా నిండుకుండలా వరద కాలువ ప్రవహిస్తూ ఉండడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐదు పంపుల ద్వారా నీటి విడుదల కొనసాగిస్తున్నట్లు గాయంత్రి పంప్ హౌస్ అధికారులు తెలిపారు.

కోటిలింగాల వద్ద గోదావరిలో పెరుగుతున్న వరద


కోటిలింగాల వద్ద గోదావరిలో పుష్కర ఘాట్ల వరకు చేరిన నీరు

వెల్గటూర్, జూలై 29: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కోటిలింగాల వద్ద గోదావరిలోకి వరద నీరు పెరుగుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి గోదావరిలోకి చేరుతున్నాయి. కడెం ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 4,311 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదలడంతో గోదావరిలో నీటి మట్టం పెరుగుతోంది. గోదావరిలోకి వరద నీరు చేరుతుండడంతో పుష్కర ఘాట్ల వరకు నీరు చేరింది. గోదావరిలో వరద నీరు చేరి నీటి మట్టం పెతుండడంతో గొర్ల కాపర్లు, మత్స్యకారులు గోదావరిలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గోదావరిలో పుణ్యస్నానాలు చేసే భక్తులు లోతు ప్రాంతానికి వెళ్ల వద్దని తహసీల్దార్ శేఖర్, ఎస్సై ఉమా సాగర్ హెచ్చరించారు.

పెరుగుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం

- ప్రాజెక్టులోకి 17,310 క్యూసెక్కుల నీరు


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరదనీరు పెరుగుతోంది. సోమవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 17,310 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 33.857 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 75.709 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 644 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 28.260 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.463 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వాడారు.

జ్వరాలతో ఇద్దరి మృతి

కాల్వశ్రీరాంపూర్, ఓదెల, జూలై 29: పెద్దపల్లి జిల్లాలో జ్వరాలతో ఇద్దరు మృతిచెందారు. కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేటలో సాయి సాత్విక్(13) మృతి చెందాడు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న సాయిసాత్విక్‌కు ఆదివారం తీవ్ర జ్వరం రావడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా ఆదివారం రాత్రి మార్గమధ్యలో మృత్యువాత పడినట్లు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే ఓదెల మండలం ఇందుర్తిలో సోమవారం గాదం ప్రతాప్(68) అనే వృద్ధుడు జ్వరంతో మృతి చెందాడు. వారం రోజుల నుంచి జ్వరంతో ప్రతాప్ మంచం పట్టాడని, వైద్యం కోసం జమ్మికుంటకు తరలించేందుకు సిద్ధమవుతుండగా ఇంట్లోనే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు.

జాఫర్ ఖాన్ పేటలో వైద్య శిబిరం


వివ జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్

కాల్వశ్రీరాంపూర్, జూలై 29: మండలంలోని జాఫర్‌ఖాన్‌పేటలో జ్వరాలు రావడంతో సోమవారం ఆ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంను జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు వర్షాకాలంలో ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి నిల్వలు, చెత్త ఉండడం వలన దోమలు పెరిగిపోయి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. జ్వరం వచ్చినట్లయితే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా సుమారు 35మంది రక్తనమూనాలు సేకరించారు. 108మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ భావన, హెచ్ఈఓ లక్ష్మణ్, ఏఎన్ఎం కవిత పాల్గొన్నారు.

పీఎఫ్‌లో మార్పులుంటే ఈ నామినేషన్‌లో సరిచేసుకోవాలి

- పీఎఫ్, బీమా, పెన్షన్ సమస్యల పరిష్కారానికి కృషి
- రీజినల్ పీఎఫ్ కమిషనర్ తానయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌పీఎఫ్‌సీ తానయ్య

జ్యోతినగర్, జూలై 29: ఉద్యోగులు, కార్మికులకు సంబంధించి ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) వివరాలలో తేడాలుంటే, వార్పులు, చేర్పులుంటే ఇ నామినేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో సరి చేసుకోవాలని రీజినల్ పీఎఫ్ కమిషనర్ ఎస్.తానయ్య సూచించారు. సోమవారం ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసి ఆధ్వర్యంలో ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియం హాలులో పీఎఫ్, ఇన్సూరెన్స్, పెన్షన్‌లపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తానయ్య మాట్లాడుతూ ఉద్యోగుల దగ్గరకే ఈపీఎఫ్ఓ కార్యక్రమం ద్వారా పీఎఫ్ సంబంధ సమస్యల పరిష్కారానికి మా వాఖ కృషి చేస్తున్నదన్నారు. కార్మికుల పీఎఫ్ డేటాలో మార్పులు చేసుకోవడానికి గతంలో మ్యాన్యువల్‌గా ప్రక్రియ ఉండేదని ఇప్పుడు ఇ నామినేషన్ అనే ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఎన్టీపీసీ ఉద్యోగుల హయ్యర్ పెన్షన్ స్కీంకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తున్నామని, 2014 తర్వాత పదవీ విరమణ చేసిన ఉద్యోగలకు హయ్యర్ పెన్షన్ వర్తింస్తుందన్నారు. అలాగే కార్మికులు పీఎఫ్‌కు సంబంధించి సమస్యలుంటే కరీంనగర్‌లోని రీజినల్ పీఎఫ్ కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, ఏజెన్సీల ప్రతినిధులు లేవనెత్తిన సందేహాను ఆర్‌పీఎఫ్ కమిషనర్ తానయ్య నివృత్తి చేశారు. హయ్యర్ పెన్షన్ విషయంలో తాము పీఎఫ్ సంస్థకు చెల్లించే సొమ్మును పంపించినప్పటికీ తమకు చెక్కులు ఎందుకు వాపసు చేశారో చెప్పాలని కొంతమంది మాజీ ఎన్టీపీసీ ఉద్యోగులు రీజినల్ కమిషనర్‌ను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐసీ అసిస్టెంట్ మేనేజర్ ఈ.కిరణ్‌కుమార్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి(పీఎఫ్) వి.వెంకట రమణ, ఎన్టీపీసీ ఏజీఎం సిక్దర్, అధికారు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

317జీవో బాధితుల బదిలీ సమస్యకు

ప్రభుత్వం పరిష్కారం చూపాలి


మాట్లాడుతున్న టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేశ్

జగిత్యాల అర్బన్, జూలై 29: జీవో 317 బాధితులకు డీఈవో పూల్‌లో ఉన్న పోస్టుల్లో బదిలీ చేస్తూ సమస్యకు పరిష్కారం చూపాలని టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుంగూరి సురేష్, గుర్రం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమేష్ మాట్లాడుతూ పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బదిలీ, పదోన్నతులతో పాటు 10,456 పండిత, పీఈటీ అప్‌గ్రేడేషన్ సమర్థవంతంగా పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్టీఎఫ్) పక్షాన కృతజ్ఞతలు తెలిపా రు. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించిన రాష్ట్రప్రభుత్వం మిగిలిపోయిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు బీఈడీ కలిగిన వారికి అర్హత కల్పించాలన్నారు. గత ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు 10వేల పీఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలని, మిగిలిన పండిత పీఈటీల పదోన్నతుల సమస్యలు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికీ రిలీవ్‌కాని ఉపాధ్యాయులను రిలీవ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయిని విజయానందరావు. జిల్లా బాధ్యులు శేఖర్, శ్రావణ్, రమేశ్, అహ్మదుల్లా ఖాన్, భూమరెడ్డి తదితరుల పాల్గొన్నారు.

కాలువలు ఇలా.. నీరు పారేదెలా

- పెగడపల్లి మండలంలో ఎస్సారెస్పీ కాలువలు అధ్వానం - పట్టించుకోని అధికారులు


పెగడపల్లి శివారులో ఎస్సారెస్పీ డీ77 కాలువలో పెరిగిన పచ్చి మొక్కలు

పెగడపల్లి, జులై 29: మరమ్మతులు లేక ఎస్సారెస్పీ కాలువలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలకు నందగిరి, అయిత్‌పల్లి మినహా 21 గ్రామాలు శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలోనే ఉండగా కాలువ నీరు వస్తేనే పంటలు పూర్తిస్థాయిలో పండుతాయి. మండలంలోని పలు డిస్ట్రిబ్యూటరీ కాలువలను ఏళ్ల క్రితం సిమెంట్ లైనింగ్ చేయగా అప్పటి నుంచి వాటి మరమ్మతు, పూడిక తీత పనులపై పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో దాదాపు అన్ని డిస్ట్రిబ్యూటరీ కాలువలు పిచ్చిమొక్కలతో నిండి పోవడమే కాకుండా సిమెంట్ లైనింగులు కూలిపోయి, తూముల షట్టర్లు ఊడిపోయి కాలువల ఆనవాళ్లు కనిపించ కుండా పోయాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి నీరు చేరితే మొదటి పంటకు మరి కొద్ది రోజులలో నీరు వదిలే పరిస్థితు లుండగా కాలువల మరమ్మతు పూడికతీత, పిచ్చిమొక్కల తొలగింపుకు మాత్రం అధికారులు దృష్టిసారించడం లేదని రైతులు వాపోతున్నారు. కాలువలలో పిచ్చిమొక్కలు పెరిగి ప్రధాన కాలువ నుంచి ఎన్ని నీళ్ల వదిలినా సమీప ప్రాం తాల రైతులకు మాత్రమే ప్రయోజనం కలుగుతోంది. చివరి ఆయకట్టు పంటలకు సాగు నీరు అందకపోవడంతో ఎండి పోతున్నాయి. అధికారులు కాలువల మరమ్మతులతో పాటు పిచ్చిమొక్కల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సైబర్ మోసంతో 1.84 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

మెట్‌పల్లి, జూలై 29: మెట్‌పల్లి పట్టణానికి చెందిన జోగ నవీన్ అనే యువకుడు సైబర్ మోసంతో 1.84 లక్షలు పోగొట్టుకున్నట్లు సోమవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జోగ నవీన్ క్రెడిట్ కార్డుతో ఓ సంస్థ వెబ్‌సైట్‌లో టీవీని కొనుగులు చేశాడు. టీవీ ప్రాబ్లం రావడంతో దాన్ని రిటర్న్ పంపడానికి ఆన్‌లైన్‌లో సంప్రదించగా వాళ్లు టీవీ కంపెనీ వాళ్లకు అందజేయాలని సూచించారు. దీంతో అన్‌లైన్‌ల్లో కస్టమర్ కేర్ నంబర్ వెతికి దానికి ఫోన్ చేశారు. టీవీ కొనుగోలు చేసిన నంబర్ తెలపాలని అడిగి దానికి ఓ లింక్ పంపాడు. వారు చెప్పిన విధంగా చేశాడు. వెంటనే అకౌంట్‌లో డబ్బులు కట్ అయినట్లు మెసేజ్ రావడంతో వెంటనే బ్యాంకులోని అధికారులను సంప్రదించగా రూ. 1.84లక్షలు కట్ అయినట్లు తెలిపారు. టీవీ కంపెనీ వారిని సంప్రదించగా మాకు ఎలాంటి డబ్బులు రాలేదని తెలపడంతో మోసపోయానని గుర్తించాడు. వెంటనే అన్‌లైన్‌లో సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు జోగ నవీన్ తెలిపారు.

సింగరేణి సీఎండీని కలిసిన తుమ్మేటి సమ్మిరెడ్డి

గోదావరిఖని, జూలై 29: సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టీపీసీసీ మీడియా కన్వీనర్ తుమ్మేటి సమ్మిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎండీకి పుష్పగుచ్చం అందజేసి సీఎండీగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల పిల్లలు నిరుద్యోగులుగా ఉన్నారని, వారిలోని నైపుణ్యం వెలికి తీసేందుకు కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్పొరేట్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను గోదావరిఖనిలో ఏర్పాటు చేయాలన్నారు. కాలుష్యాన్ని నిర్మూలించడానికి నిత్యం మొక్కలు నాటి పర్యావరణానికి దోహనం చేయాలని, సింగరేణి ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలకు సీఎస్ఆర్ ఫండ్ అందించాలని సీఎండీని కోరారు. సీఎండీని కలిసిన వారిలో టీపీసీసీ అధికార ప్రతినిధి సుధాకర్‌గౌడ్, విజయభాస్కర్, మధుకర్‌రెడ్డి ఉన్నారు.

పొలాల్లో వలస కూలీలు

- నాటు వేసేందుకు మహారాష్ట్ర నుంచి రాక - రైతులకు తప్పిన ఇబ్బందులు - ఎకరానికి రూ. 5వేలు చెల్లింపు


చెర్లబూత్కూర్‌లో నాటు వేస్తున్న మహారాష్ట్ర కూలీలు

కరీంనగర్ రూరల్, జూలై 29: ఉమ్మడి జిల్లాలో గత కొన్నేళ్లుగా వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీంతో గ్రామాల్లో నాటు వేసేందుకు కూలీల కొరత ఏర్పడింది. దీన్ని అదిగమించేందుకు రైతులు పొరుగు రాష్ట్రాల కూలీలను ఆశ్రయిస్తున్నారు. నాట్లు వేయడానికి మహారాష్ట్ర, బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూలీలు వస్తున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాల రైతులు మహారాష్ట్ర నుంచి కూలీలను రప్పించి నాట్లు వేయిస్తున్నారు. కొన్ని రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు కొంత ఆలస్యంగా పడడంతో రైతులు కొంత నిరాశ చెందారు. ఇటీవల వరణుడు కరుణించడంతో వరి నాట్లు లేటవుతాయన్న నేపథ్యంలో మండలంలోని చెర్లబూత్కూర్, ఇరుకుల్ల, దుబ్బపల్లి, చామనపల్లి, నగునూర్ గ్రామాల రైతులు మహారాష్ట్ర నుంచి కూలీలను తీసుకువచ్చారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి, చంద్రాపూర్ జిల్లాల నుంచి 120మందికి పైగా వలస వచ్చారు. ఒక్కో గ్రూప్‌లో 14మంది మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. మొత్తం 18మందితో వరి నాట్లు వేస్తున్నారు. పురుష కూలీలు ముందుగా వరి నారు తీసి మహిళలు నాటేసేందుకు వీలుగా పొలంలో సిద్ధంగా పెడుతున్నారు. ఉద యం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు నాట్లు వేస్తున్నారు. ఇందుకు గాను ఎకరానికి గుత్తగా ఐదు వేల రూపాయలు తీసుకుంటున్నారు. మహారాష్ట్ర నుంచి కూలీల రాకతో వరి నాట్లు త్వరగా పూర్తవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

'రెవెన్యూ చట్టాలపై కేటీఆర్‌కు అవగాహన లేదు'



మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

సుభాష్‌నగర్, జూలై 29: రెవెన్యూ చట్టాలపై కేటీఆర్‌కు ఏమాత్రం అవగాహన లేదని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ విమర్శించారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధరణి స్థానంలో ఏది వచ్చినా అది భూమేతే అవుతుందని కేటీఆర్ చేసిన వాఖ్యలు అర్థరహితమన్నారు. భూ సమస్యను పరిష్కరించడానికి ఆర్‌వోఆర్(రైట్ ఆఫ్ రికార్డ్స్)1971 ఆక్ట్‌ను అప్పటి ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ఆర్‌వోఆర్-2020 ఆక్ట్ ద్వారా పాత ఆర్‌వోఆర్ చట్టాన్ని రద్దు చేసి 22లక్షల ఎకరాల భూమిని సమస్యాత్మకంగా మార్చిందని ఆరోపించారు. కొత్తగా సృష్టించిన భూ సమస్యలను పరిష్కరించే అధికారం తహసీల్దార్, ఆర్‌డీవో, జాయింట్ కలెక్టర్ల చేతుల నుంచి కలెక్టర్ పరిధిలోకి మార్చి సమస్యను మరింత జటిలం చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15లోపు భూ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఆర్‌వోఆర్-2020ని సవరించి నూతన చట్టాన్ని రూపొందించే ప్రక్రియలో ధరణి కమిటీ అడుగులు వేస్తుందన్నారు. ఈ సమావేశంలో చిగిరి శ్రీధర్, బోయినిపల్లి చంద్రయ్య, సిహెచ్ రాంమూర్తి, రవీందర్, బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నాటు వైద్యులను నమ్మి ఆరోగ్యం పాడు చేసుకోవద్దు'

సుభాష్‌నగర్, జూలై 29: పైల్స్, ఫిషర్, ఫిస్టులా లాంటి జబ్బులతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులు నాటు వైద్యులను నమ్మి ఆరోగ్యం పాడు చేసుకోవద్దని ప్రముఖ లాప్రోస్కోపిక్, లేజర్ వైద్య నిపుణుడు డాక్టర్ చిట్టుమల్ల ప్రదీప్‌కుమార్ అన్నారు. నగరంలోని మైత్రీ కన్వెన్షన్‌లో గత రెండు రోజులుగా జరుగుతున్న సౌత్ ఇండియా రీజనల్ కొలొరెక్టల్ కాన్ఫరెన్స్ ప్రోక్టోదాస్-2024 సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పైల్స్, ఫిస్టులా, ఫిషర్ వ్యాధులకు అత్యాధునిక లేజర్, స్టాప్లర్ లాంటి ఇన్వాసివ్ పద్ధతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నొప్పిలేకుండా ఆపరేషన్ నిర్వహించి, ఒక్క రోజులోనే డిస్చార్జ్ చేయవచ్చన్నారు. ఈ విధానం రోగికి పూర్తిగా సురక్షితమైందన్నారు. ఈ సదస్సులో దేశంలోని ప్రముఖ కోలోరెక్టల్ వైద్య నిపుణులు వివిధ అంశాలపై వివరించారు. లైఫ్‌లైన్ ఆసుపత్రిలో లైవ్ ఆపరేషన్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ చైర్మన్ డాక్టర్ రవీందర్‌రావు, కార్యదర్శి డాక్టర్ ప్రదీప్‌కుమార్, కోశాధికారి డాక్టర్ అరుణ్‌కరారి, ఐఎస్‌సీపీ కార్యదర్శి డాక్టర్ అడుకర్, డాక్టర్ శాంతివర్ధని, డాక్టర్ గంగా ఇంకర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రశాంత్, చెల్మెడ వైద్య కళశాల డైరెక్టర్ డాక్టర్ వి సూర్యనారాయణరెడ్డి, టీజీఎంసీ సభ్యుడు డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కరీంనగర్ అర్బన్, జూలై 29: కరీంనగర్ శివారులోని మానేరు బైపాస్‌రోడ్‌లో ఉన్న ముత్యాల పోచమ్మ దేవాలయాన్ని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ స్థానం ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాల సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు బాగా పండాలని కోరారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా అసెంబ్లీ ఇంచార్జి పురుమళ్ళ శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులుగౌడ్, కరీంనగర్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మడుపు మోహన్, ఆలయ చైర్మన్ గడ్డం శ్రీరాములు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

'ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తాం'

కరీంనగర్ అర్బన్, జూలై 29: ఎన్ని అడ్డంకులు ఎదురైనా కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం లక్షన్నరలోపు ఉన్న రైతుల రుణమాఫీ చేసే కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రారంభిస్తున్నారని అన్నారు. ఆగస్టులో రెండు లక్షల వరకు సర్కార్ రైతుల రుణమాఫీ చేయనుందని పేర్కొన్నారు.

'ఢిల్లీలో విద్యార్థుల మృతి కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే'

కరీంనగర్ అర్బన్, జూలై 29: ఢిల్లీలోని సివిల్స్ కోచింగ్ సెంటర్‌లో ముగ్గురు విద్యార్థి దుర్మరణం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమేనని టీపీసీసీ ఎస్సీసెల్ సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య ఒక ప్రకటనలో ఆరోపించారు. ఉద్యోగాలు లేక 10ఏళ్ల నుంచి విద్యార్థులు నరక యాతన అనుభవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. 2014 నుంచి 2021 వరకు దేశ వ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో 182 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి విచారణకు ఆదేశించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

జమ్మికుంట రూరల్, జూలై 29: జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలో గల హజ్రత్ సయ్యద్ ఉమర్ షావళి దర్గాలో ఉర్సు ఉత్సవాలు ప్రారంభమయ్యాయని దర్గా కమిటీ చైర్మన్ సందాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంధం, ఉర్సు ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని పేర్కొన్నారు. సోమవారం గసుల్ షరీఫ్, జెండా ఆవిష్కరణ నిర్వహించామని చెప్పారు. మంగళవారం ఉర్సు ఉత్సవాలు జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా చైర్మన్‌గా రాజ్‌కుమార్



నియామకపత్రం అందుకుంటున్న రాజ్‌కుమార్

తిమ్మాపూర్, జూలై 29: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆరెల్లి రాజ్‌కుమార్ జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్(ఎన్‌సీఆర్‌సీ) కరీంనగర్ జిల్లా చైర్మన్‌గా నియామకమయ్యారు. హైదారాబాద్‌లో సోమవారం జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ గ్రీట్ అండ్ మీట్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల చైర్మన్‌లను నియమించారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా చైర్మన్‌గా ఆరెల్లి రాజ్‌కుమార్‌కు రాష్ట్ర చైర్మన్ డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ నియామక పత్రాలను అందజేశారు.

సామాజికవేత్తకు సన్మానం

హుజూరాబాద్‌రూరల్, జూలై 29 : మండలంలోని సిర్సపల్లి గ్రామానికి చెందిన సామాజికవేత్త సబ్బని వెంకట్‌ను సోమవారం చిరు వ్యాపారులు సన్మానించారు. పట్టణంలోని పాపరావు బొందలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో దగ్ధమైన చిరు వ్యాపారులకు తన వంతు బాధ్యతగా ఆర్థిక సాయం అందించినందుకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు సంగెం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, జూలై 29 : మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన చింత రమేష్ వృత్తిలో భాగంగా సోమవారం కల్లు తీస్తున్న క్రమంలో మోకు జారీ కిందపడడంతో గాయాలయ్యాయి. గమనించిన తోటి గీత కార్మికులు చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

క్రీడాకారిణికి పలువురి అభినందన

వీణవంక, జూలై 29: తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరీంనగర్ జిల్లా 49వ జూనియర్ విభాగంలో బంగారు పతకం సాధించిన అక్షితను తెలంగాణ ఒలింపిక్ సంయుక్త కార్యదర్శి మాల్లారెడ్డితో పాటు పలువురు సోమవారం అభినందించారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లికి చెందిన అక్షిత తైక్వాండోలో జిల్లా స్థాయి జాతీయ స్థాయి, ఖేలో సౌత్ ఇండియా స్థాయిలో పాల్గొని పతకాలు సాధించింది. తైక్వాండో జిల్లా అధ్యక్షుడు సోగల కుమార్, గౌరవ అధ్యక్షుడు దాసరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

'మహిళల రక్షణకే షీటీంలు'



విద్యార్థినులకు షీటీంపై అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీలత

కరీంనగర్ క్రైం, జూలై 29: మహిళల రక్షణ కోసం షీటీంలు పని చేస్తాయని కరీంనగర్ మహిళా ఠాణా, షీటీం ఇన్‌చార్జి సీఐ పి.శ్రీలత అన్నారు. యువతులు, మహిళలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. కరీంనగర్‌లోని కోట రీసోనెన్స్ జూనియర్ కళాశాలలో సోమవారం షీటీంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ పి.శ్రీలత హాజరై మాట్లాడుతూ వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థినిలు సామాజిక మాధ్యమాల వినియోగంపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అపరిచిత వ్యక్తుల మెస్సేజ్, పోస్టింగ్‌లకు స్పందించవద్దని సూచించారు. చదువుపై దృష్టిని సారించి, సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలన్నారు. గర్ల్ చైల్డ్ ప్రొటెక్షన్, ఇంటర్నెట్ వాడకం, చాటింగ్, డయల్ 100ల ప్రాము ఖ్యత, వారి వినియోగం-జాగ్రత్తలపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ రూపొందించిన టీ సేఫ్ యాప్‌ను ఉపయోగించి ఆపద సమయంలో ఎలా పోలీసులకు సమాచారం అందించవచ్చనే విషయాన్ని సీఐ వివరించారు. ఎలాంటి ఆపద, సమస్య వచ్చినా షీటీం పోలీసులను సంప్రదించాలని సూచించారు. బాధితుల సమస్యల పరిష్కారం కోసం షీటీం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. బాధితులు, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో షీటీం ఏఎస్ఐ విజయమణి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఆదర్శవంతమైంది

కరీంనగర్ టౌన్, జూలై 29: ఉపాధ్యాయ వృత్తి ఆదర్శవంతమైనదని, ప్రతి విద్యార్థిని ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తారని మాజీ మేయర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. సోమవారం సదాశివపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గర్శకుర్తి రవీందర్ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్, పీఆర్‌టీయు నాయకుడు జీవన్‌రెడ్డి, ఎస్‌జీటీ నాయకుడు మహిపాల్‌రెడ్డి డీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కోహెడచంద్రమౌళి, మానకొండూర్ మండల విద్యాధికారి శ్రీనివాస్, నాయకులు పొన్నం అనిల్‌గౌడ్, విద్యాసాగర్, తిరుపతయ్య, సర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

'అర్బన్ బ్యాంక్ అభివృద్ధికి కృషి'

కరీంనగర్ అర్బన్, జూలై 29: కరీంనగర్ అర్బన్ బ్యాంక్ అభివృద్ధికి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు అన్నారు. అర్బన్ బ్యాంక్ పాలకవర్గ సభ్యులు సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అసోసి యేట్ చైర్మన్ గడ్డం విలాసరెడ్డితో పాటు పర్బన్ ఇంచార్జి సభ్యులు మడుపు మోహన్, ముక్క భాస్కర్, విద్యాసాగర్, బ్యాంకు సీఈఓ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కరీంనగర్ అర్బన్, జూలై 29: కాంగ్రెస్ పార్టీ నాయకులు మూల రవీందర్‌రెడ్డి తల్లి మూల సుగుణ ఇటీవల మరణించగా కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సోమవారం రవీందర్‌రెడ్డిని పరామర్శించారు. మూల సుగుణ చిత్రపటనికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాజేందర్‌రావు వెంట జిల్లా కాంగ్రెస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి అంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

టీఎన్‌జీవో ఆధ్వర్యంలో సన్మానం

సుభాష్‌నగర్, జూలై 29: పదవీ విరమణ పొందనున్న ఉద్యోగులను టీఎన్‌జీవో ఆధ్వర్యంలో సన్మానించారు. సోమవారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇరిగేషన్ శాఖలో సూపరింటెండెంట్స్‌గా సేవలందించిన అంజిరెడ్డి, కృష్ణమూర్తితో పాటు కమర్షియల్ శాఖలో నాల్గవ తరగతి ఉద్యోగి, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూల్గుంటి నరసింహారెడ్డి, లక్ష్మయ్యలను సన్మానించారు. ఈకార్యక్రమంలో టీఎన్‌జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, కోశాధికారి కిరణ్‌కుమార్, కేంద్ర సంఘం కార్యదర్శి రాగి శ్రీనివాస్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు రాజేశ్‌భరద్వాజ్, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలపై బీజేపీ పోరాటం'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేవరెడ్డి

కరీంనగర్ రూరల్, జూలై 29: ప్రజా సమస్యల పై పోరాటం ఉధృతం చేస్తామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్ళెం వాసుదేవరెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్ మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ అధ్యక్షతన వల్లంపహాడ్ గ్రామంలోని హరిహర కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీ ఆరు నెలలు పూర్తి అయినప్పటికీ నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి వ్యతిరేత వస్తుందని తెలిపారు. ఎన్నికల గెలుపు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం హామీల వర్షం కురిపించిందని అన్నారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చే వరకు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ నాయ కత్వంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామ న్నారు. అలాగే గ్రామ పంచాయతీల పాలన వ్యవస్థ కుంటుపడిందని విమర్శించారు. కొంత మంది అధికారులు ఇష్టారాజ్యంగా ఇంటి అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీల్లో సమస్యలు అధికమయ్యాయని అన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం పలు అంశాలపై చర్చించి పలు సమస్యలపై తీర్మానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమనారెడ్డి, మునుగంటి కుమార్, దాడి సుధాకర్, అనుమల మహేందర్, రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కమలాకర్‌రెడ్డి, శ్రీధర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కరీంనగర్‌లో సమ్మేళనంలో పాల్గొన్న న్యూనవోదయ పాఠశాల విద్యార్థులు



హుజూరాబాద్‌లో సమ్మేళనంలో పాల్గొన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

గణేశ్‌నగర్, జూలై 29: జిల్లా కేంద్రంలోని న్యూ నవోదయ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1991-92 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులు శ్రీనివాస చారి, శ్రీనివాస రాజు, దేవేందర్ రెడ్డి, శ్రీధర్ రాజు, రత్నాకర్, శేఖర్‌రావులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కిరణ్‌కుమార్, శ్రీనివాస్, శ్రీధర్, విజయ్, ఇంద్రసేనారెడ్డి,నరేందర్, ప్రదీప్, కృష్ణవేణి, సంతోష్ రెడ్డి, లక్ష్మణాచారి, మల్లారెడ్డి, మనోహర్, తిరుపతి పాల్గొన్నారు.

● **కరీంనగర్ టౌన్:** నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1993-94 బ్యాచ్ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆనందరాజు, సతీష్, నాగరాజు, రాజ్‌కుమార్, నవీన్‌రాజు, నదిముద్దీన్, షైముద్దీన్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

● **హుజూరాబాద్:** పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1986-88 సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన సీఈసీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా గురువులను సత్కరించారు. కార్యక్రమంలో చందుపట్ల వేణు, కొండపాక సదానందం, విజయ్‌కుమార్, కొల్గూరి ఖండేరరావు, మోటం సదానందం, సంపత్, రవీందర్‌రెడ్డి, సిరిమల్ల నాగరాజు, కొత్త సమ్మిరెడ్డి, విజయలలిత, రజిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన నారుమడులు

- ఆందోళనలో రైతులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి



పొలాల్లోకి చేరిన నీరు

గంగాధర, జూలై 29: మండలంలోని ఆచంపల్లి వద్ద ఉన్న తూంలను సామర్థ్యానికి మంచి ఎత్తడంతో కాలవపై నుంచి వెళ్లిన నీరు సమీపంలోని పొలాలను ముంచేత్తిది. దీంతో నాటు వేసేందుకు సిద్ధం చేసిన నారుమళ్లు మునిగిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆచంపల్లి వరద కాలువపై ఏర్పాటు చేసిన రెండు తూంల ద్వారా కరీంనగర్ మండలం నాగులమల్యాల కొత్త చెరువును నింపుతారు. రెండు రోజులుగా లక్ష్మీపూర్ గాయత్రి పంపులను ఆన్ చేసి వరద కాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. అధికారుల అనుమతి లేకుండానే కొందరు రైతులు సామర్థ్యానికి మించి తూంల నుండి నీటిని విడుదల చేస్తున్నారు. ఈక్రమంలో గంగాధర మండలంలోని ఆచంపల్లిలోని కాలువకు నీరు ఎక్కువై గ్రామంలోని పొలాల్లోకి నీరు చేరింది. గ్రామం నుంచి విలాసాగర్ వెళ్లే దారి పూర్తిగా నీట మునిగి రాకపోకలు నిలిచిపోయాయి. మరో వైపు కాలువకు గండి పడే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. నీటి విడుదల సమయంలో అధికారులుకు పలుమార్లు విన్నవించినా స్పందనలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి పంటలకు నష్టం జరగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

సైదాపూర్, జూలై 29: సైదాపూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలంలోని పలువురు లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంత సుధాకర్ సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం చేస్తున్నదన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'డాక్టర్‌పై కేసు ఎత్తివేయాలి'

ఇల్లందకుంట, జూలై 29: డాక్టర్ కదిరే కృష్ణపై అక్రమ కేసు ఎత్తివేయాలని కేవీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లూరి కిశోర్ అన్నారు. సోమవారం ఇల్లందకుంటలో ఆయన మాట్లాడుతూ సంస్కృతంలో చెప్పే సుప్రభాతాన్ని తెలుగులో అనువదించి అర్థం చెప్పినందుకు దానిని వక్రీకరించాడని ప్రవీణ్ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే అక్రమ కేసు నమోదు చేయడం అప్రజాస్వామిక చర్య అన్నారు. తక్షణమే కృష్ణపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

సమస్య పరిష్కరించాలి

రామడుగు, జూలై 29: తన కుటుంబ అవసరాల నిమిత్తం ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఇవ్వడం కుదరదని తహసీల్దార్ చెబుతున్నారని, ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలని బీజేపీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గోపాల్ రావుపేట గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు లావా దేవీల నిమిత్తం సర్టిఫికెట్ కావాలని అడిగితే తహసీల్దార్ ఇలాంటి సమాధానం చెప్పారని వాపోయారు. ఉన్నతా ధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీసుల అదుపులో యువకుడు

హుజూరాబాద్, జూలై 29: గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలో గత కొన్ని రోజులుగా డ్రగ్స్, గంజాయిని యువకులు తీసుకుంటున్నట్లు తెలిసింది. సాయంత్రం వేళల్లో తల్లిదండ్రులకు తెలి యకుండా గ్రామాలు, పట్టణ శివారులలో కూర్చొని డ్రగ్స్, గంజాయిని సేవిస్తున్నట్లు సమాచారం. ఈ కోవలోనే హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు గంజాయికి అలవాటు పడి దానినే వ్యాపారంగా చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగాపూర్ గ్రామానికి వచ్చి ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. మరొక వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిసింది. ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు రంగాపూర్ గ్రామానికి చెందిన యువకుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. హుజూరాబాద్‌లో మరో ఇద్దరు కూడా గంజాయి, డ్రగ్స్ వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది. పోలీసులు గంజాయి విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పీఎఫ్, ఇన్సూరెన్స్ సేవలపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు

హుజూరాబాద్‌రూరల్, జూలై 29 : మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం పీఎఫ్, ఇన్సూరెన్స్, పెన్షన్‌లపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రావిడెంట్ ఫండ్‌ను ఏ విధంగా జమ చేయాలని, ఏ విధంగా వాటిని తీసుకోవచ్చునో వివరించారు. ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవడం, ఈపీఎఫ్‌వోలో మినహాయింపులపై అవగాహన కల్పించారు. కార్మికుల పీఎఫ్ డేటాలో మార్పులు చేసుకోవడానికి గతంలో మ్యాన్యువల్‌గా ప్రక్రియ ఉండేదని ఇప్పుడు ఇ నామి నేషన్ అనే ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. పదవీ విరమణ రోజు ఎంప్లాయిమెంట్ ప్రావిడెంట్ ఫండ్‌ను ఏ విధంగా పొందుతారో వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె శంకర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా కల్లేపల్లి లక్ష్మయ్య

కరీంనగర్ అర్బన్, జూలై 29: కాంగ్రెస్‌పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మొగిలిపాలెం మాజీ సర్పంచ్, సీనియర్ న్యాయవాది కల్లేపల్లి లక్ష్మయ్యను నియమిస్తూ టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మన్లుగా వడ్లూరి కృష్ణ, ప్రదీప్ కుమార్ రాజు, కన్వీనర్లుగా కొత్తకొండ శంకర్, లింగంపల్లి శ్రీకాంత్, ఎండి నవాజ్, జాయింట్ కన్వీనర్లుగా తుమ్మ ప్రభాకర్, రాయికంటి కుమార్, ఐతు సృజన్, బొడ్డు రాజు, ముఖ్య సలహాదారులుగా సింగిరెడ్డి లక్ష్మారెడ్డి, లుక్కా రాజేశం, ఎస్ కిషన్‌లను నియమించారు. జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ తమ మీద నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, స్టేట్ జాయింట్ కన్వీనర్ భూక్య రజనీష్, ఈ నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్‌లోకి టీవీఎస్ మరో ద్విచక్రవాహనం

కరీంనగర్ టౌన్, జూలై 29: కరీంనగర్ మార్కెట్‌లోకి టీవీఎస్ కంపెనీ మరో ద్విచక్ర వాహనాన్ని విడుదల చేసింది. సోమవారం కరీంనగర్‌లోని ఆదర్శ టీవీఎస్ షోరూంలో టీవీఎస్ మోటారు కంపెనీ సరికొత్త టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 160 4వి బ్లేజ్ బ్లాక్ మోటారును ఎస్‌బీఐ ఆఫీసర్లు జితేందర్, రవినాయక్ విడుదల చేశారు.

ఆదర్శ టీవీఎస్ మేనేజింగ్ డైరెక్టర్ బి.తిరుమల్ గౌడ్ నూతన వాహన ప్రత్యేకతను వివరించారు. ఈకార్యక్రమంలో టీవీఎస్ మోటార్ ప్రాంతీయ మేనేజర్ గౌతమ్, ప్రతినిధులు పవన్‌సాయి, షోరూం మేనేజర్ జి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

'వైరాగ్యం'కు పురస్కారం ప్రదానం

కరీంనగర్ కల్చరల్, జూలై 29: జిల్లాకు చెందిన వైరాగ్యం ప్రభాకర్ ఆదివారం హైదరాబాద్ త్యాగరాయ గానసభలో సాహితీ గురు బిరుదుతో పాటు గౌతమి బంగారు నంది జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. యస్వీఆర్ ఆర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్, గౌతమేశ్వర గో సంరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దైవజ్ఞశర్మ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

బండారి అంకయ్య మృతికి సంతాపం

కరీంనగర్ కల్చరల్, జూలై 29: లోక్‌సత్తా ఉద్యమ సంస్థ వ్యవస్థాపక సభ్యుడు, కవి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ బండారి అంకయ్య మృతి పట్ల కరీంనగర్ వినియోగదారుల మండలి, లోక్‌సత్తా ఉత్యమ సంస్థ, కరీంనగర్ ఫిలం సొసైటీ జన విజ్ఞాన వేదిక సంస్థలు ఒక ప్రకటనలో తీవ్ర సంతాపాన్ని తెలిపాయి. సంతాపం తెలిపిన వారిలో వినియోగదారుల మండలి అధ్యక్షుడు ఆర్ వేంకటేశ్వర్‌రావు, కార్యదర్శి రఘురాం, కోల రామచంద్రారెడ్డి, లక్ష్మణ్‌కుమార్, సయ్యద్ ముజాఫర్, శంకరయ్య, అశోక్, గంగాధర్, గంగారావు, జగదీశ్వర్, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ అధ్యక్షుడు ప్రకాశ్‌హోల్లా, కార్యదర్శి చంద్రప్రభాకర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు పందిల్ల శంకర్, మహేందర్, మనోహర్, అరుణ్, దయాశంకర్, ఐలయ్య, రాజమల్లు, జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి శంకర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు రామరాజు తదితరులున్నారు.

చీరల పంపిణీ

సుభాష్‌నగర్, జూలై 29: మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. సోమవారం ఫౌండేషన్ సభ్యులు చకిలం రూప పుట్టినరోజు సందర్భంగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గొడుగులు, పిల్లలకు ఆట వస్తువులు అందచేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న, శ్రీనివాస్, రూప పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కరీంనగర్ టౌన్, జూలై 29: నగరంలోని 11వ డివిజన్ గౌతమీనగర్‌లో ఎస్‌డబ్ల్యూజీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పనులను కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సయ్య పటేల్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా డ్రైనేజీ లేక నీరు రోడ్డుపై నిలిచిపోయి ప్రజలు, కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ పనులు పూర్తయితే ఇబ్బందులు తొలగుతాయని అన్నారు. కార్యక్రమంలో ఈఈ యాదగిరి, శ్రావణ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడి మృతి

తిమ్మాపూర్, జూలై 29: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్‌లో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జాప శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం రాత్రి వైజాగ్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. మూడు రోజుల క్రితం మిత్రులతో కలిసి వైజాగ్ టూర్‌కి వెళ్లిన జాప శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం రాత్రి గుండెపోటు రావడంతో మిత్రులు ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

జమ్మికుంట, జూలై 29: డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్పుట్ డీలర్స్ (దేశీ) కోర్సులో చేరేందుకు లైసెన్స్ కలిగిన విత్తన, పురుగులమందు, ఎరువుల డీలర్లు దరఖాస్తులు చేసుకోవాలని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు ఏడాది పాటు ఉంటుందని పేర్కొన్నారు. నలభై శిక్షణ తరగతులు, ఎనిమిది క్షేత్ర సందర్శనలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన డీలర్లు బుధవారంలోగా కేవీకేలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే వారు వివరాలకు కేవీకే కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎల్కపల్లి పొలు

మానకొండూర్, జూలై 29: ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎల్కపల్లి పొలును నియమిస్తూ జిల్లా ఇన్‌చార్జి ఇంజం వెంకట్‌స్వామి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పొలు మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలు వేసి బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బోనాలు

మానకొండూర్, జూలై 29: మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో గల కస్తూర్బాగాంధీ విద్యాలయంలో సోమవారం బోనాలు నిర్వహించారు. ఆషాఢ మాసం పురష్కరించుకొని విద్యాలయంలో విద్యార్థినులు బోనాలు సందర్భంగా ముగ్గులతో అలంకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు బోనాలు నిర్వహించామని తెలిపారు.

బీసీ యువజన సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా పిట్టల రజనీకాంత్

చిగురుమామిడి, జూలై 29: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన పిట్టల రజనీకాంత్‌ను బీసీ యువజన సంక్షేమ సంఘం జిల్లా విభాగం కార్యదర్శిగా నియమిస్తూ ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్యల ఆదేశాల మేరకు రజనీకాంత్‌కు బాధ్యతను అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ బీసీ కులాల సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహక రించిన జిల్లా, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.